సాక్షి నిర్మల్

మంగళవారం । 11 । జూన్ । 2024



వరి సాగు.. విత్తన ఎంపికే కీలకం

సాగుకు అనువైన వరి వంగడాలు రైతాంగానికి అందుబాటులో ఉన్నాయి. అయితే విత్తనం ఎంపికే సాగులో కీలకం. 8లో▸



గోదావరి కాలుష్యం ఆగేనా..?

గోదావరి రాష్ట్రంలోకి ప్రవేశించే బాసర వద్దనే కలుషితం అవుతోంది. మహారాష్ట్రలో ఉన్న ఆల్కాహాల్ ఫ్యాక్టరీలు వ్యర్థాలను నదిలోకి వదులుతున్నాయి. 10లో▸

గరిష్టం/కనిష్టం
37.4 /26.3

వాతావరణం

ఆకాశం చాలా వరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడ వర్షం కురిసే అవకాశ ఉంది.

న్యూస్‌రీల్

ఎడ్లబండిపై బడిబాట



పెంచికల్ పాడ్‌లో ఎడ్లబండిపై ప్రచారం నిర్వహిస్తున్న గ్రామస్తులు

కుంటాల: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను చేర్పించేందుకు వినూత్నరీతిలో ప్రచారం చేస్తున్నారు కుంటాల మండలం పెంచికల్‌పాడ్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఎల్లన్న. ఉపాధ్యాయులు, గ్రామస్తులతో కలిసి సోమవారం గ్రామంలో ఎడ్లబండ్లపై ప్రధాన వీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. అపారవిద్య.. అనుభవం కలిగిన ఉపాధ్యాయుతో విద్యాబోధన, ఎస్సీ, ఎస్టీ, బీడీ కార్మికుల పిల్లలకు స్కాలర్ షిప్, సంవత్సరానికి రెండు జతల యూనిఫాం , సన్నబియ్యంతో మధ్యాహ్న భోజన తదితర మౌలిక వసతుల వివరాలతో 'మా పాఠశాల.. మా ప్రత్యేకత ' కరపత్రం రూపొందించి గ్రామస్తులను చైతన్య పరుస్తున్నారు. ఐదేళ్లు నిండిన పిల్లల ఇంటికివెళ్లి ప్రభుత్వ బడికి రావాలని పూలమాలని వేసి ఆహ్వానించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సారిక, వివోఏ సంపత్, అంగన్‌వాడీ టీచర్ శ్యామల, గ్రామస్తులు పాల్గొన్నారు.

బెస్ట్ అవెలబుల్ విద్యార్థులకు పుస్తకాలు అందించాలి

నిర్మల్‌చైన్‌గేట్: బెస్ట్ అవెలబుల్ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల మెస్, ట్యూషన్ ఫీజు, పుస్తకాలు, యూనిఫాంలకు సంబంధించిన డబ్బులు ప్రభుత్వం త్వరగా చెల్లించాలని అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు బత్తుల రంజిత్ కోరారు. ఈమేరకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోని కొన్ని పాఠశాలల్లో బిల్లులు రాలేదని చెప్పి విద్యార్థుల తల్లిదండ్రుల వద్ద డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. బెస్ట్ అవెలబుల్ స్కీమ్‌లో సీటు పొందిన విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలలకు డబ్బులు ఇవ్వొద్దని సూచించారు.

కడెం విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు



పురస్కారాలు అందుకుంటున్న శృతి, రీతిక

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదివిన విద్యార్థులు ప్రతిభ పురస్కారాలు అందుకున్నట్లు పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రవీంద్రభారతీలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి 10 జీపీఏ సాధించిన పలువురు విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు ప్రదానం చేశారు. కడెం పాఠశాల విద్యార్థులు బుగ్గ శృతి, కొప్పుల రీతిక ఈ పురస్కారాలు అందుకున్నారు. అనంతరం హెచ్‌ఎం శ్రీనివాస్, విద్యార్థులను ఫౌండేషన్ సభ్యులు సన్మానించారు.

పాక్‌పట్ల విద్యార్థికి ప్రతిభ అవార్డు..



పురస్కారం అందుకుంటున్న అవేజ్

సోన్: మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాల విద్యార్థి ఎస్‌కే.అవేజ్ పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించడంతో రవీంద్రభారతిలో ప్రతిభ అవార్డు ప్రదానం చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం ఎస్.వెంకన్న తెలిపారు. అవేజ్‌ను ఉపాధ్యాయులు అభినందించారు.

భాషా పండితులు, పీఈటీల సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్ల పరిశీలనలో అధికారులు

నిర్మల్ రూరల్: ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా పీఈటీలు, భాషా పండితుల ప్రమోషన్ కోసం సోమవారం సర్టిఫికెట్ల పరిశీలన ముగిసింది. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో ఉదయం నుంచి సాయంత్రం వరకు డీఈవో రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వెరిఫికేషన్ నిర్వహించారు. 32 మంది పీఈటీలు, 192 మంది భాషా పండితుల సర్టిఫికెట్లను అధికారులు పరిశీలించారు. మంగళవారం సీనియారిటీ లిస్టు ప్రకటించి, ఆ తర్వాత వెబ్ ఆప్షన్ నమోదు అవకాశం కల్పిస్తారు.



బడి బస్సు భద్రమేనా?

- రేపటి నుంచి పాఠశాలల పునఃప్రారంభం
- ఫిట్‌నెస్ టెస్ట్‌పై యాజమాన్యాల నిర్లక్ష్యం
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- చర్యలకు సిద్ధమవుతున్న రవాణాశాఖ



నిర్మల్‌చైన్‌గేట్: పాఠశాలల పునఃప్రారంభానికి సమయం ఆసన్నమైంది. బుధవారం నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం అవుతుంది. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో బడిబాట నిర్వహిస్తుండగా, ఇప్పటికే అడ్మిషన్లు పూర్తి చేసుకున్న ప్రైవేటు పాఠశాలలు.. పిల్లలను తరలించే వాహనాలను సిద్ధం చేసుకుంటున్నాయి. అయితే పాఠశాలలు తెరుచుకునే నాటికే బస్సులకు ఫిట్‌నెస్ టెస్టు చేయించాలి. కానీ జిల్లాలో సగం విద్యా సంస్థల యాజమాన్యాలు కూడా బస్సులకు ఫిట్‌నెస్ పరీక్షలు చేయించలేదు. ఈ నేపథ్యంలో బస్సులు భద్రతపై తల్లిదండ్రులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు.

317 ప్రైవేటు పాఠశాలలు

జిల్లాలో 317 ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీటిల్లో చదువుకునే విద్యార్థులను 244 బస్సులు పాఠశాలలకు చేరవేస్తున్నాయి. ఈ బస్సులకు ఏటా ఫిట్‌నెస్ పరీక్షలు నిర్వహించాలి. ఇందుకు యాజమాన్యాలు చొరవ చూపాలి. ఫిట్‌నెస్ ఉన్న బస్సులే రోడ్లపై తిరగాలి. లేకుంటే రవాణా అధికారులు సీజ్ చేస్తారు.

ఫిట్‌నెస్ అంటే..

స్కూల్ బస్సుల ఇంజిన్ నుంచి టైర్ల వరకు రవాణాశాఖ నిబంధనల మేరకు ఉండాలి. చివరకు బస్సులో సీట్లు చిరిగిపోయినా ఫిట్నెస్ లేదని రవాణాశాఖ అనుమతి నిరాకరిస్తుంది. ప్రతీ అంశాన్ని తనిఖీ చేసిన తర్వాతనే వాహనానికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్ జారీ చేస్తారు.

ప్రత్యేకంగా బస్సులు..

ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచుకునేందుకు ప్రయత్నిస్తుంటాయి. ఈ క్రమంలో పట్టణ, గ్రామాల నుంచి విద్యార్థులను తీసుకొచ్చేందుకు బస్సు సౌకర్యం కల్పిస్తున్నాయి. ఇందుకు ప్రత్యేకంగా రవాణా చార్జీలు విద్యార్థుల నుంచే వసూలు చేస్తున్నారు.

ఫిట్‌నెస్ లేకుంటే చర్యలు..

రవాణా నిబంధనల ప్రకారం ప్రతీ పాఠశాల బస్సుకు ఫిట్‌నెస్ టెస్ట్ చేయించుకోవాలి. ఫిట్‌నెస్ లేకుండా పాఠశాల బస్సులు రోడ్లపై తిరిగితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటాం. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠినంగా వ్యవహరిస్తాం. విద్యా సంస్థల యాజమాన్యాలు త్వరగా వాహనాలకు ఫిట్‌నెస్ చేయించాలి. – మహేందర్, ఎంవీఐ, నిర్మల్

నిబంధనలు ఇవీ..

- వాహనాలకు ఫిట్నెస్ పరీక్ష చేయించాలంటే ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- దరఖాస్తులో పాఠశాల వివరాలు, బస్సు మోడల్, డ్రైవర్ వివరాలు, అటెండెంట్, ఫొటోలు, బస్సు నడిచే మార్గం, సీట్ల పరిమితి, సెల్ నంబర్ తదితర వివరాలు నమోదు చేయాలి.
- నిబంధనల మేరకు వాహనంలో మెడికల్ కిట్లు, గాలి వెలుతురు వచ్చేలా కిటికీలు, సీట్ల మధ్య రాడ్లు అమర్చి ఉండాలి.
- విద్యార్థులు బస్సులో ఎక్కేందుకు, దిగేందుకు అనుకూలంగా 325 మి.మీ ఎత్తులో బస్సు మెట్లు ఉండాలి.
- ఆపద సమయంలో దిగేందుకు అత్యవసర ద్వారం తప్పకుండా ఉండాలి.
- విద్యార్థులు బస్సు దిగేటపుడు, ఎక్కేటపుడు డ్రైవర్‌కు కనబడేలా రెండు వైపులా సైడ్ అద్దాలు, అన్ని కిటికీలకు ఇనుప జాలీలు ఉండాలి.
- వాహనం టైర్లు, బ్రేక్‌లు నాణ్యతతో ఉండేలా చూసుకోవాలి. బస్సుపై పాఠశాల పూర్తి వివరాలు రాసి ఉంచాలి.
- పాఠశాల బస్సులు నడిపే డ్రైవర్లకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని సూచిస్తున్నారు.
- రాత్రి వేళల్లో బస్సులను గుర్తుపట్టేలా నాలుగు వైపులా రేడియం స్టిక్కర్లు ఏర్పాటు చేసుకోవాలి.

'డబుల్' ఇళ్ల కోసం ఆందోళన



ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న లబ్ధిదారులు

భైంసాటౌన్: పట్టణంలో తమకు కేటాయించిన డబుల్ బెడ్రూం ఇళ్లను వెంటనే అప్పగించాలని లబ్ధిదారులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆర్డీవో కార్యాలయానికి సోమవారం చేరుకుని ఆందోళన చేశారు. డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించి రెండేళ్లు గడుస్తున్నా తమకు అప్పగించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అద్దె ఇళ్లలో ఉంటూ సకాలంలో కిరాయి చెల్లించలేక అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా స్పందించడం లేదని పేర్కొన్నారు. అనంతరం ఆర్డీవో కోమల్‌రెడ్డిని కలిసి తమ ఆవేదన వ్యక్తం చేశారు. స్పందించిన ఆర్డీవో సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

డీఆర్డీవో వేధింపులు ఆపండి

- ప్రజావాణిలో సెర్ప్ ఉద్యోగుల ఫిర్యాదు



డీఆర్డీవోపై చర్యలు తీసుకోవాలని కలెక్టరేట్‌కు వచ్చిన సెర్ప్ ఉద్యోగులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా సెర్ప్ ఉద్యోగులపై డీఆర్డీవో వేధింపులు ఆపాలని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. యూనిఫాంలో స్టిచ్చింగ్ విషయంలో తీవ్రమైన ఒత్తిడి చేయడంతో నిర్మల్ రూరల్ ఏపీఎం గంగన్న గుండెపోటుతో మరణించాడని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన పనులే కాకుండా డీఆర్డీవో సొంత ఎజెండాతో పనులు చేయిస్తూ తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నారని పేర్కొన్నారు. సమయపాలన లేకుండా సెలవు రోజులు, రాత్రులు కూడా జూమ్ మీటింగ్ నిర్వహిస్తూ తీవ్ర పదజాలంతో భయభ్రాంతులకు గురిచేస్తున్నారని తెలిపారు. తన సొంత మెప్పు కోసం సిబ్బందితో చేపలు, కోళ్ల పెంపకం చేపట్టారన్నారు. కూరగాయల పెంపకంలో కలుపుతీత, మొక్కలకు నీళ్లు పట్టడం, చేపలు, కోళ్లకు మేతవేయడం వంటి పనులు తమతో చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వినాయక చవితి పండుగ సమయంలో గణపతి ప్రతిమలు రూ.30 ఉంటే వాటిని రూ.100 రేటు ఫిక్స్ చేసి బెదిరించి అమ్మిపించారని ఆరోపించారు. దీపావళికి మట్టి ప్రమిదలు మార్కెట్‌లో రూ.2 ఉంటే తమను రూ.5 కు అమ్మాలని ఒత్తిడి చేశారని తెలిపారు. నిరల్ మండల సమాఖ్యలో జరిగిన అక్రమ లావాదేవీలపై సమగ్ర విచారణ చేపట్టాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో ఏపీఎంలు మల్లేశ్, భోజన్న, అరుణ, గంగమణి, గురుచరణ్, రమేశ్, డీపీఎం వెంకటసాయిప్రసాద్, సీసీలు శ్రీనివాస్, లక్ష్మణ్, సంతోష్, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

పీఎస్‌హెచ్‌ఎం పోస్టులు పెంచాలి

- పీఆర్టీయూటీఎస్ వినతి



సర్టిఫికెట్ వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న నాయకులు

నిర్మల్‌ఖిల్లా: రాష్ట్ర ప్రభుత్వం పండిత పోస్టులను ఉన్నతీకరిస్తూ ప్రమోషన్ల ప్రక్రియను కొనసాగించడం హర్షణీయమని, ఇదే రీతిలో పీఎస్ హెచ్‌ఎం పోస్టులు సంఖ్యను కూడా రాష్ట్రవ్యాప్తంగా 10 వేలకు పెంచి ఇదే షెడ్యూల్‌లో ప్రమోషన్లు ఇవ్వాలని పీఆర్టీయూటీఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తోట నరేంద్రబాబు, రమణారావు కోరారు. జిల్లా కేంద్రంలోని సెయింట్ థామస్ పాఠశాలలో భాషా పండిత, పీఈటీల అప్‌గ్రేడేషన్ కోసం కొనసాగుతున్న సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ప్రక్రియను సోమవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. అర్ధంతరంగా ఆగిపోయిన బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను రాష్ట్ర విద్యాశాఖ పూర్తి చేయనుండటం ఆనందదాయకమన్నారు. అదేవిధంగా ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయ పోస్టులను కూడా పెంచాలని కోరారు. ఈ విషయంపై రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి మాణిక్యరాజు కన్నన్‌కు తమ సంఘం రాష్ట్రశాఖ తరఫు విన్నవించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లాశాఖ నాయకులు రమేశ్‌రెడ్డి, శ్రీనివాస్, సదానందం, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలపై అప్రమత్తంగా ఉండాలి

- ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క



వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్, అధికారులు

నిర్మల్‌చైన్‌గేట్: రుతుపవనాలు రాష్ట్రమంతటా విస్తరించడంతో వర్షాలు కురుస్తున్నాయని, రాబోయే ఐదు రోజులు రాష్ట్రంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు, వరదలపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్క సూచించారు. అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంబంధిత శాఖల అధికారులతో వర్షాకాలంలో తీసుకోవాల్సిన చర్యలపై సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. వర్షాకాలం ఇబ్బందులు ఏర్పడకుండా తీసుకుంటున్న చర్యలు, మిషన్ భగీరథ సర్వే, ఏకరూప దుస్తుల తయారీ వంటి అంశాలపై జిల్లాల వారీగా వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. క్లోరినేషన్ చేపట్టిన తర్వాతే తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. పురాతన ఇళ్లలో ఉంటున్న వారిని వెంటనే ఖాళీ చేయించాలని ఆదేశించారు. గ్రామాల్లో జరుగుతున్న మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు పంపిణీ చేసే ఏకరూప దుస్తుల తయారీ ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. అదనపు కలెక్టర్ ఫైజాన్‌అహ్మద్ మాట్లాడుతూ, జిల్లాలో భారీ వర్షాలు, వరదల వలన ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. మిషన్ భగీరథ సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తామని, నిర్ణీత గడువులోగా యూనిఫాంల స్టిచ్చింగ్ పూర్తి చేస్తామని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్, జెడ్పీ సీఈవో గోవింద్, డీఆర్డీఓ విజయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ సందీప్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించండి

- నాలుగు నెలల క్రితం మలేషియాలో జిల్లా వాసి మృతి
- కుటుంబ సభ్యుల అనుమతితో అక్కడే అంత్యక్రియలు
- డెత్ సర్టిఫికెట్ కోసం అధికారులకు వినతి



స్వదేశ్‌కు వివరాలు అందిస్తున్న కుటుంబ సభ్యులు

నిర్మల్‌ఖిల్లా: ఉపాధి కోసం మలేషియా వెళ్లి ఓ కార్మికుడు అనారోగ్యంతో అక్కడే మృతిచెందాడు. అంతిమ సంస్కారాలు సైతం అక్కడే నిర్వహించారు. మృతుడి భార్య, కుటుంబీకులు కడసారి చూపునకు నోచుకోలేదు. మరణ ధ్రువీకరణ పత్రం ఇప్పించాలని కుటుంబ సభ్యులు నాలుగు నెలలుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. లక్ష్మణచాంద మండల కేంద్రానికి చెందిన దొనకంటి భీమేశ్వర్ ఉపాధి నిమిత్తం గతేడాది మలేషియా వెళ్లాడు. అక్కడే అనారోగ్యానికిగురై ఫిబ్రవరి 27న మృతిచెందాడు. భీమేశ్వర్ మృతదేహాన్ని స్వస్థలానికి తరలించడానికి లక్షల రూపాయల ఖర్చవుతుందని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అంత డబ్బు లేకపోవడంతో కుటుంబ సభ్యుల అనుమతితో అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. భీమేశ్వర్‌కు భార్య రుక్మవ్వ, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. నాలుగు నెలలు గడిచినా ఇండియన్ ఎంబసీ అధికారులు పాస్‌పోర్టు, డెత్ సర్టిఫికెట్ పంపలేదని భీమేశ్వర్ కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ పథకాల కోసం మరణ ధ్రువీకరణ పత్రం అవసరం కావడంతో రాష్ట్ర సచివాలయంలోని సాధారణ పరిపాలన విభాగం అధికారులను కలిసి విన్నవించారు. అయినా స్పందన లేకపోవడంతో ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు స్వదేశ్ పరికిపండ్ల దృష్టికి సోమవారం తీసుకెళ్లారు. భీమేశ్వర్ డెత్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు త్వరగా ఇప్పించేలా చూస్తామని తెలిపారు. ఈమేరకు కలెక్టర్ కార్యాలయంలోని ప్రజావాణిలో కూడా మృతుడి భార్య రుక్మవ్వ అర్జీ పెట్టారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



వివిధ మెడళ్లతో విద్యార్థులు

ఖానాపూర్: కరీంనగర్‌లో జరిగిన రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో పట్టణంతోపాటు మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. బీర్నంది జెడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన నాగచైతన్య గోల్డ్ మెడల్, రిష్వంత్ సిల్వర్ మెడల్ అందుకున్నారు. బీర్నంది వాసు విద్యాలయంకు చెందిన అక్షర్ గోల్డ్ మెడల్ సాధించాడు. రంగపేటకు చెందిన ప్రవళిక, నాగరాజు గోల్డ్‌మెడల్స్ సాధించారు. గోసంపల్లె గ్రామానికి చెందిన బ్రిలియంట్ పాఠశాల విద్యార్థి చరణ్‌తేజ్ బ్రౌన్ మెడల్, సుర్షిత్, యుక్తిక సిల్వర్ మెడల్, రంగపేటకు చెందిన రమేశ్ సిల్వర్ మెడల్, రిత్విక్ గోల్డ్ మెడల్, సాధించారని కరాటే మాస్టర్ మచ్చ మనోహర్ వివరించారు.

గోడు వినండి.. గోస తీర్చండి

- పునఃప్రారంభమైన ప్రజావాణి
- భారీగా తరలి వచ్చిన అర్జీదారులు
- దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్
- సమస్యలు త్వరగా పరిష్కరించాలని సూచన



కలెక్టర్‌కు డబుల్ బెడ్‌రూం సమస్యలు విన్నవిస్తున్న మహాలక్ష్మి కాలనీవాసులు

నిర్మల్‌చైన్‌గేట్: లోక్‌సభ ఎన్నికల కోడ్ కారణంగా మార్చి 16 నుంచి కలెక్టరేట్‌లో ప్రతీ సోమవారం నిర్వహించే ప్రజావాణి నిలిచిపోయింది. ఈనెల 6వ తేదీతో కోడ్ ముగియడంతో సోమవారం ప్రజావాణి పునఃప్రారంభమైంది. దీంతో భారీగా అర్జీదారులు తరలివచ్చారు. కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ స్వయంగా దరఖాస్తులు స్వీకరించారు. బాధితుల సమస్యలను ఓపికగా విన్నారు. దరఖాస్తులను సంబంధిత శాఖ అధికారులకు అందించి త్వరగా పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలన్నారు. ధరణి, రెవెన్యూ, వ్యవసాయం, కొత్త రేషన్ కార్డులు, పింఛన్లు, డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు, భూ సమస్యల వంటి అంశాలపై ఫిర్యాదులు అధికంగా వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్ కుమార్, డీఆర్వో భుజంగరావు, ఆర్డీవో రత్నకళ్యాణి, వివిధ శాఖల జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

డబుల్ బెడ్‌రూమ్ లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలి..

స్థానిక కలెక్టరేట్ ఎదుట నిర్మించిన నాగనాయిపేట్ డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో నివాసం ఉంటున్న లబ్ధిదారుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ప్రజావాణిలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో అధికారులు కొందరికి మాత్రమే ఇళ్ల పట్టాలు అందించారని మిగతా వారికి పట్టాలు ఇవ్వలేదని తెలిపారు. నీటి సౌకర్యం కోసం నాలుగు చేతి పంపులు వేయించాలన్నారు. ఇళ్ల మధ్య తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు వేలాడుతున్నాయని సరి చేయించాలని కోరారు. డ్రైనేజీ పైపులు పదేపదే లీక్ అవుతున్నాయని, మున్సిపల్ సిబ్బందితో మరమ్మతులు చేయించాలని విన్నవించారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్



నిరసన తెలుపుతున్న గడ్‌చాంద గ్రామవాసులు

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి..

జిల్లా కేంద్రంలోని పలు కాలనీలలో సొంత ఇల్లు లేక అద్దెకు ఉంటున్నామని ప్రభుత్వం నిర్మించిన డబుల్ బెడ్‌రూం ఇళ్ల తమకు కేటాయించాలని పలువురు ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. తాము అర్హులమని సర్వేలో గుర్తించినా ఇళ్ల కేటాయించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు తీసుకున్నవారు అమ్ముకుంటున్నారని, అద్దెకు ఇస్తున్నారని తెలిపారు. ఇల్లు లేని పేదలకు ఇళ్లు కేటాయించాలని కోరారు.

ఎస్సారెస్పీ భూములు కాపాడాలి..

ఎస్సారెస్పీ భూములను కొందరు ఆక్రమించుకుని సాగు చేసుకుంటున్నారని లోకేశ్వరం మండలం గడ్‌చాంద్ గ్రామస్తులు ప్రజావాణిలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఎస్సారెస్పీ భూములు దున్నుకోవడంతో పశువుల మేతకు భూమి లేకుండా పోతోందని తెలిపారు. కొందరు ఎస్సారెస్పీ భూములను అక్రమంగా అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. విద్యుత్ అధికారులు మోటార్లకు కరెంటు ఇవ్వడంతో భూములు ఆక్రమణకు గురవుతున్నాయని తెలిపారు.

మా భూమి మాకు ఇప్పించాలి..

సారంగాపూర్ మండలం గోపాల్‌పేట్ తాండలోని 403 సర్వే నంబర్లో తమకు 4.32 ఎకరాల భూమి ఉందని, 45 ఏళ్లుగా దానిని సాగు చేసుకుంటున్నామని శ్రీనివాస్‌యాదవ్ అనే రైతు తెలిపాడు. ధరణి పాస్ బుక్ కూడా ఉందని పేర్కొన్నారు. ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడు ఆ భూమి తమదని అటవీశాఖ అధికారులు సగం వరకు ఫెన్సింగ్ వేశారని తెలిపాడు. తమ భూమి ఇప్పించాలని కలెక్టర్‌కు విన్నవించాడు.

క్లుప్తంగా

బాసరలో ఎస్‌బీఐ డీజీఎం పూజలు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎస్‌బీఐడీజీఎం విజయ్‌కుమార్ సాహో

బాసర: ప్రముఖ పుణ్యక్షేత్రం బాసర జ్ఞాన సరస్వతీ అమ్మవారిని సోమవారం కూడా వేల మంది భక్తులు దర్శించుకున్నారు. ఎస్‌బీఐ నిజామాబాద్ బ్రాంచ్ ఏవో ఆఫీస్ డీజీఎం విజయ్‌కుమార్ సాహో ఉదయం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు డీజీఎంకు తీర్థ ప్రసాదాలను అందజేసి, ఆశీర్వదించారు. ఆయన వెంట బాసర ఎస్‌బీఐ బ్రాంచ్ మేనేజర్ రాజశేఖర్, బ్యాంకు సిబ్బంది ఉన్నారు.

పశువుల కాపరిపై అడవిపంది దాడి



గాయాలపాలైన మొడెల్ల భూమన్న

కుంటాల: మండలంలోని లింబా(బి) గ్రామానికి చెందిన పశువుల కాపరి మొడెల్ల భూమన్నపై సోమవారం అడవి పంది దాడిచేసింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. భూమన్న రోజు మాదిరిగానే పశువులను మేపేందుకు అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అడవిలో ముళ్లపొదల నుంచి దూసుకొచ్చిన అడవిపంది భూమన్నపై దాడి చేసింది. దీంతో ఆయన తొడ భాగంలో తీవ్ర గాయం అయింది. కుటుంబ సభ్యులు 108లో భైంసా ఏరియా ఆస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నిజామాబాద్ ఆస్పత్రికి తరలించారు.

నానోసీడర్.. సూపర్!



నానో సీడర్ ద్వారా విత్తనాలు వేస్తున్న రైతు సాయిరాం

తాంసి: పత్తి సాగులో రైతులను కూలీల కొరత వేధిస్తోంది. దీనిని అధిగమించేందుకు అన్నదాతలు యంత్రాలపై ఆధారపడుతున్నారు. మండలంలోని గిరిగాం గ్రామానికి చెందిన సాయిరాం అనే రైతు నానో సీడర్ ద్వారా ఇలా పత్తి విత్తనాలు వేశాడు. ఎలాంటి ఇంధన ఖర్చు లేకుండా రోజుకు ఒక కూలీతో ఆరు ఎకరాల వరకు విత్తుకోవచ్చని రైతు చెబుతున్నాడు. ఈ యంత్రాన్ని రూ.7వేలకు కొనుగోలు చేసినట్లు ఆయన పేర్కొన్నాడు.

వరి సాగు.. విత్తన ఎంపికే కీలకం

- అందుబాటులో అనువైన వంగడాలు
- కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ



కోట శివకృష్ణ, ప్రోగ్రాం కోఆర్డినేటర్, కేవీకే బెల్లంపల్లి



సాగుచేసిన తెలంగాణ సోన వరి వంగడం (ఫైల్)

బెల్లంపల్లి: సాగుకు అనువైన వరి వంగడాలు రైతాంగానికి అందుబాటులో ఉన్నాయి. తెగుళ్లు, చీడపీడలను తట్టుకుని అధిక దిగుబడినిచ్చే సన్న, దొడ్డు రకాలు సాగు చేసుకోవాలి. తద్వారా ఆశించిన మేరకు ఫలితం ఉంటుంది. పంటను సకాలంలో విత్తుకోవడం వల్ల చాలా రకాల ప్రయోజనాలు ఉంటాయి. ఆలస్యంగా విత్తుకోవడం శ్రేయస్కరం కాదు. అదును దాటిపోయిన తర్వాత నాట్లు వేసుకోవడం వల్ల పంటసాగులో అనేక అవరోధాలు ఎదురవుతాయి. ప్రస్తుత వానాకాలంలో సాగు చేయడానికి పలు రకాల వరి వంగడాలు సిద్ధంగా ఉన్నట్లు బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రోగ్రాం కోఆర్డినేటర్ కోట శివకృష్ణ తెలిపారు. ఆయా రకాల వరి వంగడాలు, తెగుళ్లను తట్టుకునే గుణం, పంట దిగుబడి తదితర అంశాలు ఆయన మాటల్లోనే..

సన్న గింజ రకాలు

తెలంగాణ సోన(ఆర్.ఎస్.ఆర్ 15048): వానాకాలానికి, యాసంగికి ఎంతో అనువైన రకం. ఈ రకాన్ని సాగు చేయడం వల్ల ఎకరాకు గరిష్ఠంగా 25 నుంచి 30 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జూలై మొదటి వారం నుంచి పంటను విత్తుకోవాలి. ముందుగా విత్తుకోవడం వల్ల పంట కాలం పెరుగుతుంది. అగ్గి తెగులును తట్టుకుంటుంది. పొట్టకుళ్లు తెగులును కొంతవరకు నిలువరిస్తుంది.

జగిత్యాల వరి-3(జేజీఎల్ 27356): వానాకాలం, యాసంగికాలంలోనూ విత్తుకోవచ్చు. పంటసాగుకు అనువైన రకం. ఎకరానికి గరిష్ఠంగా 28 క్వింటాళ్ల దిగుబడిని సాధించవచ్చు. మెడ విరుపు, పొట్టకుళ్లు తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. అన్నం రుచిగా, మంచి నాణ్యత కలిగి ఉంటుంది.

రాజేంద్రనగర్ వరి-3(ఆర్ఎస్ఆర్ 15459): ఈ రకం వరి వానాకాలానికి అనుకూలమైంది. ఎకరానికి గరిష్ఠంగా 18 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. ఆకు అగ్గి తెగులు, వరి ఈగ పురుగును మధ్యస్తంగా తట్టుకుంటుంది. సంప్రదాయ చిట్టి ముత్యాలు రకంతో పోల్చినప్పుడు చేను పడిపోయే అవకాశం తక్కువ.

సోమ్నాథ్(డబ్ల్యూజీయల్.347): వానాకాలం పంటగా సాగు చేయడానికి అనువైన వంగడం. ఎకరాకు 28 క్వింటాళ్ల దిగుబడి సాధించవచ్చు. ఉల్లికోడు(బయోటైప్ 1అండ్5) తట్టుకునే శక్తి ఉంటుంది. అగ్గి తెగులును కొంతవరకు జయిస్తుంది. నారుమడి దశలో కొంతవరకు చలిని తట్టుకునే గుణం ఉంటుంది.

రాజేంద్ర నగర్ వరి-4(ఆర్.ఎస్.ఆర్.21278): ఈ వంగడం వానాకాలం, యాసంగి రెండు కాలాల్లోనూ సాగు చేయవచ్చు. ఎకరాకు పంట దిగుబడి 26 క్వింటాళ్ల వరకు వస్తుంది. అగ్గి తెగులును మధ్యస్తంగా తట్టుకుంటుంది. ఈ వంగడం పొట్టిరకం. పెనుగాలులు వీచినా కింద పడిపోదు.

కూనారం రైస్-1(కే.ఎస్.యమ్.733): వానాకాలానికి, యాసంగికి అనువైన వంగడం. ఈ రకం సాగు చేయడం వల్ల ఎకరాకు గరిష్ఠంగా 29-30 క్వింటాళ్ల పంట దిగుబడి సాధించవచ్చు. ఈ రకం కొంతమేర అగ్గి తెగులు నివారణకు తోడ్పడుతుంది. నారుమడిలో చలిని తట్టుకునే గుణం ఉంటుంది. విత్తన నిద్రావస్థ రెండు వారాలు ఉంటుంది.

రాజేంద్రనగర్ వరి-2(ఆర్.ఎస్.ఆర్.15435): వానాకాలం సాగుకు అనువైన పంట రకం. ఎకరాకు 22 క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చే అవకాశాలు ఉంటాయి. ఈ రకం ఎంతో సువాసన ఇస్తుంది. పొడువు గింజరకం. అగ్గితెగులు, ఆకుమచ్చ తెగుళ్లను కొంతవరకు నివారించగల శక్తి ఉంటుంది. అన్నం నాణ్యతగా ఉంటుంది.

కంపాసాగర్ వరి-1(కేపీఎస్.2874): ఈ రకం వంగడాన్ని వానాకాలంలో సాగు చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. ఎకరాకు 29-30 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి సాధించవచ్చు. సుడిదోమ, అగ్గి తెగులును తట్టుకుంటుంది. చౌడు నేలలకు అనుకూలమైంది. 7-10 రోజుల వరకు విత్తన నిద్రావస్థ ఉంటుంది.

కూనారం వరి-2(కే.ఎస్.యమ్.1638): వానాకాలం, యాసంగిలో ఈ రకాన్ని సాగు చేయడానికి అనుకూలమైంది. ఎకరాకు గరిష్ఠంగా 30-34 క్వింటాళ్ల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. ఉల్లికోడు(బయోటైప్ 3), అగ్గి తెగులును సమర్థవంతంగా తట్టుకుని నిలబడుతుంది. అన్నం రుచిగా, నాణ్యత కలిగి ఉంటుంది.

వరంగల్ వరి-2(డబ్ల్యూ.జీ.ఎల్.962): వానాకాలానికి, యాసంగికి అనువైన రకం. ఎకరాకు 26 నుంచి 30 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తుంది. అన్నం నాణ్యత సాంబ మసూరిని పోలి ఉంటుంది. అగ్గి తెగులును కొంతవరకు తట్టుకునే గుణాన్ని కలిగి ఉంటుంది.

దొడ్డు గింజ రకాలు

బతుకమ్మ(జే.జీ.ఎల్.18047): ఈ రకం వంగడం వానాకాలానికి ఎంతో అనువైంది. ఎకరాకు 25-30 క్వింటాళ్ల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. బ్యాక్టీరియా ఎండాకు తెగులు, సుడిదోమ, పచ్చదోమను కొంతవరకు తట్టుకునే శక్తి కలిగి ఉంటుంది. చలిని తట్టుకుని నిలబడుతుంది. విత్తన నిద్రావస్థ మూడు వారాలు ఉంటుంది. గింజరాలే గుణం యంటీయూ 1010 రకం కంటే తక్కువ.

జగిత్యాల రైస్-1(జేజీఎల్.24423): వానాకాలానికి, యాసంగికి అనువైన రకం. ఎకరాకు గరిష్ఠంగా 35 క్వింటాళ్ల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. ఉల్లికోడు(బయోటైప్ 1, 3, 5)ను తట్టుకునే శక్తిని కలిగి ఉంటుంది. సుడిదోమ, గోధుమ రంగు, ఆకుపచ్చ తెగుళ్లను కొంతవరకు తట్టుకుంటుంది. అగ్గితెగులును ఎక్కువగా ఆశిస్తుంది. గింజరాలే గుణం తక్కువ. చేను నేలపై పడిపోదు. విత్తన నిద్రావస్థ రెండు వారాలు ఉంటుంది.

వరంగల్ రైస్-1(డబ్ల్యూజీఎల్ 915): వానాకాలానికి అనువైన రకం. ఎకరాకు 30-35 క్వింటాళ్ల పంట దిగుబడిని సాధించవచ్చు. సుడి దోమ, బ్యాక్టీరియా ఎండాకు తెగులు, అగ్గి తెగులు, ట్రుంగో వైరస్ తెగుళ్లను కొంతవరకు తట్టుకునే గుణం ఉంటుంది. డ్రమ్‌సీడర్/దమ్ములో నేరుగా వెదజల్లే పద్ధతిలో సాగుకు అనుకూలం.

తెలంగాణ వరి-1(డబ్ల్యూజీఎల్ 789): వానాకాలానికి అనువైన రకం. ఎకరాకు 25 నుంచి 30 క్వింటాళ్ల వరకు పంట దిగుబడిని ఇస్తుంది. అగ్గి తెగులును కొంతమేర నివారిస్తుంది. గింజరాలే గుణం తక్కువ. చేను నేలపై పడి పోదు.

మిగులు సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఉట్నూర్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్‌ని లోకారి-కె, బేల, నేరడిగొండ, మామడ మండలాల్లో గల నాలుగు మినీ గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బూ గుప్తా ప్రకటనలో తెలిపారు. ఒకటో తరగతి ఆంగ్ల మాధ్యమంలో ఒక సీటు, 2వ తరగతిలో 3, 4వ తరగతిలో 1, 5వ తరగతిలో 32 సీట్లు ఖాళీగా ఉన్నట్లు పేర్కొన్నారు. అర్హులైన గిరిజన బాలికలు ఈ నెల 18లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు ఆయా పాఠశాలల సిబ్బందిని సంప్రదించాలని పేర్కొన్నారు.

ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపిక



ఉమ్మడి జిల్లా జట్టుకు ఎంపికైన క్రికెటర్లు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రానికి చెందిన పదిమంది క్రికెటర్లు అండర్-19 క్రికెట్ సీనియర్ జట్టుకు ఎంపికైనట్లు ఆబిద్ క్రికెట్ అకాడమీ నిర్వాహకుడు అబ్దుల్ ఆబీద్ తెలిపారు. ఆబిద్ క్రికెట్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్న వీరంతా హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఇటీవల నిర్వహించిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాస్థాయి అండర్-19 ఎంపిక పోటీల్లో అత్యుత్తమ కనబర్చారని పేర్కొన్నారు. జట్టుకు ఎంపికైన వారిలో నందన్, చందన్, ఆదిల్, కైఫ్, అవినాష్, షాదాబ్, కాశీఫ్, స్టాండ్ బైగా మరో ముగ్గురు ఎంపికైనట్లు తెలిపారు. త్వరలో హైదరాబాద్‌లోని ఉప్పల్ స్టేడియంలో నిర్వహించనున్న పోటీలకు వీరు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- వాటర్ ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టిన లారీ
- డ్రైవర్ అక్కడికక్కడే మృతి
- మృతుడి కుటుంబ సభ్యులు, గ్రామస్తుల రాస్తారోకో
- జాతీయ రహదారిపై గంటల తరబడి నిలిచిన వాహనాలు



జాదవ్ రాజు (ఫైల్)



రోదిస్తున్న మృతుడి కుటుంబ సభ్యులు



జాతీయ రహదారిపై నిలిచిన వాహనాలు

నేరడిగొండ: మండలంలోని దూద్‌గండి జాతీయ రహదారిపై సోమవారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతిచెందగా, మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. మండలంలోని శంకరాపూర్ గ్రామానికి చెందిన జాదవ్ రాజు (34) కేఎస్ఆర్ సంస్థలోని నీటి ట్యాంకర్‌పై డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. రోజువారీగా జాతీయ రహదారి డివైడర్‌లో ఉన్న చెట్లకు నీరు పోసే క్రమంలో ఆయన డ్రైవింగ్ చేస్తుండగా, బీహార్‌కు చెందిన మరో వ్యక్తి పైపు ద్వారా నీరు అందిస్తున్నాడు. కాగా నిర్మల్ వైపు నుంచి ఆదిలాబాద్ వైపు వెళ్తున్న లారీ ఈ నీటి ట్యాంకర్‌ను వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందాడు. బీహార్‌కు చెందిన వ్యక్తి స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. విషయం తెలుసుకున్న శంకరాపూర్ గ్రామస్తులు, మృతుడి బంధువులు, కుటుంబ సభ్యులు సంఘటన అక్కడికి చేరుకొని ఆందోళన చేపట్టారు. మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ జాతీయ రహదారిపై బైఠాయించారు. సుమారు మూడున్నర గంటల పాటు వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఉట్నూర్ డీఎస్పీ నాగేంద్ర, ఇచ్చోడ సీఐ భూమేశ్ అక్కడికి చేరుకొని ఆందోళనకారులను సముదాయించారు. సంస్థకు చెందిన యాజమాన్యంతో మాట్లాడించారు. కొంతసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. మృతుడి కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో వారు శాంతించారు. కాగా వివిధ మండలాల ఎస్సైలతో పాటు ప్రత్యేక బలగాలు అక్కడికి చేరుకున్నాయి. వారిని సముదాయించి మృతదేహాన్ని రిమ్స్‌కు తరలించారు. అనంతరం రాకపోకలను పునరుద్ధరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.

బీసీ వసతి గృహాల్లో ఆన్‌లైన్ ప్రవేశాలు

- ఇప్పటికే మొదలైన పోస్ట్‌మెట్రిక్
- రేపటి నుంచి ప్రీమెట్రిక్ మరూ..



దరఖాస్తు చేసే వెబ్‌సైట్

బోథ్: బీసీ వసతి గృహల్లో ప్రవేశాలకు వేళయింది. విద్యార్థులు గతంలో నేరుగా వసతి గృహానికి వెళ్లి దరఖాస్తు అందజేయాల్సి వచ్చేది. ప్రస్తుతం ఆ శాఖ ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 1వ తేదీ నుంచి పోస్టుమెట్రిక్ సీట్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తుంది. అలాగే 12 నుంచి ప్రీ మెట్రిక్ విద్యార్థులకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ప్రక్రియ పారంభం కానుంది. https://bchostels.cgg.gov.in.ndex.do వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

కావాల్సిన పత్రాలు

- ప్రస్తుతం చదువుతున్న బోనఫైడ్
- ఆధార్ కార్డు
- పాసైన తరగతి మార్కుల జాబితా

జిల్లాలో పోస్ట్‌మెట్రిక్ బీసీ వసతిగృహాలు (ఇంటర్ ఆపైన చదివే విద్యార్థులకు)

బాలురు : ఆదిలాబాద్, బోథ్, బజార్‌హత్నూర్, ఇచ్చోడ

బాలికలు: ఆదిలాబాద్, ఇచ్చోడ, ఉట్నూర్

ప్రీమెట్రిక్ బీసీ వసతి గృహాలు..(పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు)

బాలురు : ఆదిలాబాద్, ఇంద్రవెల్లి, జైనథ్, కౌఠ బి, ఉట్నూర్, తలమడుగు

బాలికలు: ఇచ్చోడ

తల్వార్‌తో బెదిరించిన ముగ్గురి అరెస్టు

- నలుగురిపై కేసు నమోదు
- ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ జీవన్‌రెడ్డి

కైలాస్‌నగర్: తల్వార్‌తో బెదిరింపులకు పాల్పడిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు ఆదిలాబాద్ డీఎస్పీ జీవన్‌రెడ్డి తెలిపారు. జిల్లా కేంద్రంలోని టూటౌన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఘటనకు సంబంధించిన వివరాలు వెల్లడించారు. ఈ నెల 6న ఆదిలాబాద్ పట్టణంలోని తిర్పెల్లి వద్ద గల శ్రీనివాస వైన్స్‌లో నలుగురు వ్యక్తులు తల్వార్ చూపించి మద్యం ఇవ్వాలని, లేకుంటే చంపేస్తామని బెదిరింపులకు దిగిన నలుగురిపై టూటౌన్‌లో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. ఇందులో తిర్పెల్లికి చెందిన షేక్ నౌషద్, పంజేషా కాలనీకి చెందిన లాలు అలియాస్ అతిఫ్ ఉద్దీన్ ఫారూఖీ, మహాలక్ష్మివాడకు చెందిన షేక్ ఇర్ఫాన్‌ను అరెస్టు చేయగా, ఖోట తలాబ్‌కు చెందిన అజ్మత్ ఖురేషి పరారీలో ఉన్నట్లుగా తెలిపారు. ముగ్గురిని రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. వీరిపై గతంలో కూడా పలు దొంగతనం, బెదిరింపు కేసులు నమోదైనట్లు చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా బెదిరించిన వారిపై నాన్‌బెయిలబుల్ సెక్షన్లు నమోదు చేసినట్లు తెలిపారు. పాత నేరస్తులు, రౌడీషీటర్లు డబ్బుల కోసం బెదిరింపులకు పాల్పడితే పోలీసులను సంప్రదించాలని సూచించారు. నిందితుల వద్ద నుంచి ఒక సెల్‌ఫోన్, తల్వార్‌ను స్వాధీనం చేసుకున్నట్లుగా వెల్లడించారు. నిందితులను గుర్తించి పట్టుకున్న టూటౌన్ సిబ్బంది రమేశ్, నరేశ్, క్రాంతిని ఆయన అభినందించారు. ఇందులో టూటౌన్ సీఐ అశోక్,సిబ్బంది పాల్గొన్నారు.

పోస్టాఫీసులో చోరీ

ఇచ్చోడ: మండలకేంద్రంలోని పోస్టాఫీస్‌లో గుర్తు తెలియని వ్యక్తులు ఆదివారం అర్ధరాత్రి చోరీకి పాల్పడ్డారు. వివరాలిలా ఉన్నాయి. రాత్రి వేళలో పోస్టాఫీసు ప్రధాన ద్వారం పగులగొట్టి దుండుగులు లోనికి ప్రవేశించారు. అందులోని లాకర్‌ను ఎత్తుకెళ్లారు. సిబ్బంది సోమవారం ఉదయం కార్యాలయానికి వెళ్లగా తాళం పగిలి ఉంది. వెంటనే శాఖ ఉన్నతాధికారులతో పాటు పోలీసులకు సమాచారం అందించినట్లు సబ్ పోస్ట్‌మాస్టర్ నిషాద్ షేక్ తెలిపారు. లాకర్‌లో రూ.6,900 నగదు, రూ.11వేల విలువ గల పోస్టల్ స్టాంప్‌లు, రూ. 2,600 విలువ గల రెవెన్యూ స్టాంపులు, రూ.6,700 ఇండియాన్ పోస్టల్ ఆర్డర్ స్టాంపులు, 350 పోస్టల్ పాసు బుక్‌లు ఉన్నట్లు తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి



అర్జీలు స్వీకరిస్తున్న పీవో ఖుష్బూ గుప్తా

- ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

ఉట్నూర్‌రూరల్: గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి ఆమె అర్జీలు స్వీకరించారు. దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా సత్వర చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖల అధి కారులను పీవో ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు వైద్యాధికారి కుమురం బాలు, ఆర్సీవో గంగాధర్, ఏవో రాంబాబు, ప్రిన్సిపాల్ మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వృద్ధుడు మృతి

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని బస్టాండ్‌లో గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పట్టణ సీఐ ప్రవీణ్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 65 ఏళ్ల వృద్ధుడు బస్టాండ్‌లో ఆదివారం స్పృహ తప్పి పడిపోయి ఉండగా స్థానికులు గమనించి 108లో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ.. సోమవారం మృతి చెందాడు. మృతుడి వివరాలు తెలిసినవారు పట్టణ పోలీస్ స్టేషన్‌లో సంప్రదించాలని సీఐ సూచించారు.

గుడుంబా విక్రయించిన ఇద్దరు మహిళలకు జైలు

ఇచ్చోడ: గుడుంబా విక్రయించిన కేసులో గుడిహత్నూర్ మండల కేంద్రానికి చెందిన జాదవ్ విమల, బక్వాడ్‌కు ఏడాది జైలు శిక్ష విధిస్తూ గుడిహత్నూర్ తహసీల్దార్ కవితారెడ్డి సోమవారం తీర్పు చెప్పారు. ఎక్సైజ్ సీఐ జుల్ఫికర్ అహ్మద్ తెలిపిన ప్రకారం.. ఇద్దరు మహిళలు కొంత కాలంగా గుడుంబా విక్రయిస్తున్నారు. పలుమార్లు అరెస్టుచేసి కోర్టులో హాజరుపరిచినా వీరి తీరులో మార్పు రాలేదు. నాలుగు నెలల క్రితం వీరిని తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినా మళ్లీ విక్రయిస్తూ పట్టుబడ్డారు. మరోసారి తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా ఇద్దరికి ఏడాదిపాటు జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ఈ మేరకు వారిని అదుపులోకి తీసుకొని జైలుకు తరలించినట్లు సీఐ పేర్కొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

ముథోల్: మండల కేంద్రంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. లోకేశ్వరం మండల కేంద్రానికి చెందిన శ్రీకాంత్ సోమవారం ముథోల్ నుంచి ద్విచక్రవాహనంపై భైంసాకు వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ఘటనలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని ఆస్పత్రికి తరలించారు.

గల్లంతైన విద్యార్థి మృతదేహం లభ్యం

భైంసాటౌన్: పట్టణ శివారులోని గడ్డెన్నవాగు ప్రాజెక్టులో ఆదివారం సాయంత్రం గల్లంతైన విద్యార్థి సోలంకి పవన్‌కుమార్(18) మృతదేహం సోమవారంలభించింది. ఉదయం గాలింపు చేపట్టగా విద్యార్థి మృతదేహం దొరికినట్లు ఎస్సై ఎండీ.గౌసుద్దీన్ తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం ఏరియాస్పత్రికి తరలించామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ



ఆధారాలు సేకరిస్తున్న క్లూస్ టీం, ఎస్సై షరీఫ్

భైంసాటౌన్: పట్టణంలోని ఎన్‌బీ కాలనీలో తాళం వేసి ఉన్న ఓ ఇంట్లో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగిందని ఎస్సై ఎండీ షరీఫ్ తెలి పారు. వినయ్‌కుమార్ తన కుటుంబ సభ్యులతో కలిసి రెండురోజుల క్రితం ఊరెళ్లాడు. తల్లి ఒక్కరే ఇంట్లో ఉండగా, ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి అదే కాలనీలోని బంధువుల ఇంటికి వెళ్లింది. దీంతో అర్ధరాత్రి దొంగలు తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బీరువా పగులగొట్టి రూ.30 వేల నగదు, 3 తులాల బంగారం ఎత్తుకెళ్లారు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి తాళం పగులగొట్టి ఉండడంతో పోలీసులకు సమాచారమివ్వగా, వారు క్లూస్ టీంతో వచ్చి ఆధారాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి అనుమానాస్పద మృతి



బోతేకర్ గంగాధర్(ఫైల్)

నర్సాపూర్ (జి): మండలంలోని గొల్లమాడ శివారు అటవీ ప్రాంతం(స్వర్ణ ప్రాజెక్ట్ దగ్గరలో) ఓ యువకుడు అనుమానాస్పదంగా మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భైంసా మండలం కోతల్‌గాం గ్రామానికి చెందిన బోతేకర్ గంగాధర్(30) మేస్త్రీ పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గత నెల 31న పని నిమిత్తం భైంసా వెళ్లి.. ఇంటికి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు గాలించారు. ఆచూకీ తెలియకపోవడంతో ఈనెల 6న భైంసా టౌన్ పోలీస్ స్టేషన్‌లో గంగాధర్ తల్లి ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం నర్సాపూర్(జి) మండలం గొల్లమాడ శివారు అటవీ ప్రాంతం(స్వర్ణ ప్రాజెక్టు దగ్గరలో) ఓ యువకుడి కుళ్లిన మృతదేహం ఉందని సమాచారం అందడంతో నిర్మల్ రూరల్ సీఐ శ్రీనివాస్, ఎస్సై హన్మాండ్లు ఘటన స్థలానికి చేరుకున్నారు. గంగాధర్ తల్లి రంజనాబాయి, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. మృతుడి ఒంటిపై ఉన్న ఆధారాలతో గంగాధర్‌గా గుర్తించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండడంతో సంఘటన స్థలంలోనే నిర్మల్ ప్రభుత్వ ఆసుపత్రి డాక్టర్ దశరథ్ పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం అక్కడే అంత్యక్రియలు నిర్వహించారు. తన కుమారుడి మరణంపై రంజనాబాయి అనుమానం వ్యక్తం చేస్తూ నర్సాపూర్(జి) పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈమేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై హన్మాండ్లు తెలిపారు.

ట్రాక్టర్ బోల్తాపడి ఒకరి మృతి

మామడ: మండలంలోని పులిమడుగు గ్రామానికి చెందిన ఆత్రం ఆనంద్‌రావు(45) జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ధనజా భీంరావు, ఆత్రం ఆనంద్‌రావు పులిమడుగు నుంచి ట్రాక్టర్‌పై నిర్మల్ జిల్లా కేంద్రం వైపు వస్తుండగా వెనుక నుంచి వచ్చిన ఐచర్ వాహనం ఢీకొట్టింది. ఈ క్రమంలో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీలో ఉన్న ఆనంద్‌రావు తీవ్రంగా గాయపడి మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్‌తోపాటు భీంరావులు గాయపడ్డారు. సంఘటన స్థలికి వచ్చిన ఎస్సై సందీప్, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

క్లుప్తంగా

మరుగుదొడ్లను తొలగించాలి



వినతిపత్రం ఇస్తున్న టోల్‌ప్లాజా సిబ్బంది

సోన్: మరుగుదొడ్లు తొలగించాలని కోరుతూ గంజాల్ టోల్‌ప్లాజా ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు సోమవారం ఎంపీవో ఖలీల్ హైమద్‌కు వినతిపత్రం అందజేశారు. టోల్ ప్లాజా పక్కన సాయి తిరుమల సిమెంట్ పైప్ ఇండస్ట్రీస్‌లో పనిచేసే సిబ్బందికోసం మరుగుదొడ్లు నిర్మించారు. డ్రెయినేజీలు లేకపోవడంతో దాని నుంచి వచ్చే మురుగునీటితో దుర్వాసన వస్తోందని, దీంతో అనారోగ్యాల పాలయ్యే ప్రమాదం ఉందని వివరించారు.

తానూరు ఎంపీడీవో బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న అబ్దుల్ సమద్

తానూరు: తానూరు ఎంపీడీవోగా అబ్దుల్ సమద్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నేరడిగొండ ఎంపీడీవోగా పనిచేసిన ఆయన బదిలీపై తానూరు ఎంపీడీవోగా వచ్చారు. కార్యాలయం సిబ్బంది ఘన స్వాగతం పలికి సన్మానించారు.

హైలెవెల్ కాలువ పరిశీలన

సారంగాపూర్: మండలంలోని వైకుంఠాపూర్ గ్రామ శివారు ప్రాంతంలో అసంపూర్తిగా నిర్మించిన హైలెవెల్ కాలువను సోమవారం జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరిశీలించారు. పనులు అసంపూర్తిగా చేపట్టడం వల్ల కెనాల్ పక్కనే ఉన్న పంటపొలాలకు నష్టం కలుగుతుందని టేకుల పల్లి పర్వన్న అనే రైతు జెడ్పీటీసీకి వివరించారు. స్పందించిన ఆయన విషయాన్ని అధికారులతో చర్చించి సమస్యకు పరిష్కారం చూపిస్తామన్నారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, సింగం భోజాగౌడ్, మాజీ సర్పంచ్ ఎల్లన్న, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సైని కలిసిన మండల కాంగ్రెస్ నాయకులు



ఎస్సైకి పూలమొక్క ఇస్తున్న నాయకులు

లక్ష్మణచాంద: లక్ష్మణచాంద ఎస్సైగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి.సుమలతను సోమవారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పూలమొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వొడ్నాల రాజేశ్వర్, నాయకులు ఈటెల శ్రీనివాస్, గంగాదర్ గౌడ్, లక్ష్మారెడ్డి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

న్యాయవాదుల సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న న్యాయవాదులు

నిర్మల్‌చైన్‌గేట్: భారత ప్రధాన మంత్రిగా నరేంద్ర మోదీ మూడోసారి అధికారం చేపట్టడంతో బీజేపీ లీగల్‌సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు మిఠాయిలు పంపిణీ చేసి సంబురాలు చేసుకున్నారు. జిల్లా కన్వీనర్ రమణారావు మాట్లాడుతూ రానున్న కాలంలో భారత్‌ను ఆర్థిక శక్తిగా ఎదగడానికి కృషి చేస్తారని ఆకాంక్షించారు. న్యాయవాదులు శుభకరన్, నూనె గంగాధర్, ఓస మహేందర్, కొమ్మోజి రమణ, రాజేశ్వర్ రత్నం, రాజు, శైలేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఇక నుంచి ఆన్‌లైన్ రశీదులు



ఆన్‌లైన్ రశీదు అందజేస్తున్న ఏఈఈ శివప్రసాద్

కుంటాల: గతంలో విద్యుత్ బిల్లులు రశీదుల రూపంలో వినియోగదారులకు పెన్‌తో రాసి ఇచ్చే పద్ధతి ఉండేది. అప్పుడప్పుడు పొరపాట్లు జరగడంతో సమస్యలు తలెత్తేవి. విద్యుత్ శాఖ ఆఫ్‌లైన్ విధానానికి స్వస్తి చెప్పి ఆన్‌లైన్ విధానాన్ని ప్రవేశపెట్టింది. జూన్ నుంచి విద్యుత్ వినియోగదారులకు బిల్లులు చెల్లించిన వెంటనే ఆన్‌లైన్ రశీదు అందజేస్తున్నట్లు ఏఈ శివప్రసాద్ తెలిపారు. సోమవారం అందాకూర్‌లో విద్యుత్ వినియోగదారులకు ఆన్‌లైన్ ద్వారా బిల్లులు అందజేశారు.

పంచాయతీ కార్మికుల వేతనాలేవి?



చెత్త సేకరిస్తున్న పంచాయతీ కార్మికులు (ఫైల్)

- మూడు నెలలుగా అందని జీతాలు
- ఆర్థిక ఇబ్బందుల్లో కార్మికులు
- నిధులు విడుదల చేయాలని వేడుకోలు

లక్ష్మణచాంద: పొద్దున లేచింది మొదలు రాత్రి వరకు పలు రకాల పనిచేస్తూ గ్రామాలను అద్దంలా ఉంచడంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న కృషి వెలకట్టలేనిది. మండలంలోని అన్ని గ్రామాలను నిత్యం పరిశుభ్రంగా ఉంచే పంచాయతీ కార్మికులకు మూడు నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో అనేక ఇక్కట్లకు గురవుతున్నారు. అసలే చాలీచాలని వేతనాలతో కుటుంబాలను నెట్టుకొస్తున్న పంచాయతీ కార్మికులు మూడు నెలలుగా మరింత ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

83 మంది కార్మికులు

మండలంలో మొత్తం 18 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. జనాభా ప్రాతిపదికన గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టడంకోసం తెలంగాణ ప్రభుత్వం ఆయా జీపీల పరిధిలో మల్టీపర్పస్ వర్కర్ల పేరున 83 మంది పంచాయతీ కార్మికులను నియమించింది.

వచ్చేది అరకొర వేతనాలు...

గ్రామాలను అద్దంలాగా ఉంచడంలో విశేష కృషి చేస్తున్న పంచాయతీ కార్మికులకు గత మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వేతనాలు అందక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అసలే అరకొర వేతనాలు.. అవికూడా నెలనెలా రాకపోవడంతో ఇబ్బందిగా ఉందని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి వేతనాలు విడుదల చేసి ఆర్థిక ఇబ్బందులు తొలగించాలని మండలంలోని పంచాయతీ కార్మికులు కోరుతున్నారు.

జీపీల్లో మల్టీపర్పస్ వర్కర్ల పనులు ఇవే..

- మురుగు కాలువలను శుభ్రం చేయడం.
- పల్లె ప్రకృతి వనాల నిర్వహణ, హరితహారం కోసం ఏర్పాటు చేసిన నర్సరీల్లోని మొక్కలను కాపాడటం.
- హరితహారంలో భాగంగా నాటిన మొక్కలకు నీరుపోసి కంటికిరెప్పలా కాపాడటం.
- రోడ్లపై చెత్తా చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచడం.
- గ్రామాల్లో విద్యుత్ బల్బులను అమర్చడం.

మూణ్నెళ్లయి రావాలె..



మండలంలోని పొట్టపెల్లి గ్రామ పంచాయతీ కార్మికురాలిగా పనిచేస్తున్నా. అసలే తక్కువ జీతానికి పనిచేస్తున్నాం. అదికూడా మూడు నెలలుగా రాకపోవడంతో కుటుంబం గడవడం ఇబ్బందిగా ఉంది.

– గంగవ్వ, పంచాయతీ కార్మికురాలు, పొట్టపెల్లి

నిధులు విడుదల కాగానే జమ చేస్తాం



మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్మికులకు మార్చి, ఏప్రిల్, మే నెలలకు సంబంధించిన వేతనాలకోసం ఇదివరకే చెక్కులు కొట్టాం. ప్రభుత్వం నిధులు విడుదల చేయగానే వెంటనే వారి ఖాతాల్లో జమ అవుతాయి.

– నసీరుద్దీన్, ఎంపీవో, లక్ష్మణచాంద



ముధోల్: 2010-2011 బ్యాచ్ పదోతరగతి విద్యార్థులు

ముధోల్: మండలంలోని ఆష్టా గ్రామంలో సోమవారం 2010–11 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకుని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు అనిల్, భరత్, గంగాధర్, శ్యామ్, అన్వేష్, అజయ్ పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కుంటాల ఉన్నత పాఠశాలలో 2004–2005 విద్యా సంవత్సరంలో పదోతరగతి చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 20 ఏళ్ల తర్వాత కలిసిన వారు ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకుని రోజంతా సంతోషంగా గడిపారు. ఆదర్శ యూత్ ఆధ్వర్యంలో చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాలు మున్ముందు కొనసాగించాలని తీర్మానించారు. కష్టసుఖాల్లో తోడుగా ఉంటామని విద్యార్థులు నిర్ణయించుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



కుంటాల: జిల్లా పరిషత్ పాఠశాల వద్ద పూర్వ విద్యార్థులు

'ధాన్యంలో కోత విధించిన వారిపై చర్యలు తీసుకోవాలి'

ఖానాపూర్: రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువస్తే నిర్వాహకులు, అధికారులు కుమ్మక్కై ఇష్టారాజ్యంగా కోతలు విధిస్తూ బహిరంగ దోపిడీకి పాల్పడ్డారని ఎంసీపీఐయూ జిల్లా కార్యదర్శి పీటర్ ఆరోపించారు. సోమవారం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా అధికారులకు సైతం ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. రైతుల ధాన్యం దోపిడీకి పాల్పడ్డ రైస్‌మిల్లులను బ్లాక్ లిస్ట్‌లో పెట్టి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రైతులతో కలిసి ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

గోవులు అక్రమంగా రవాణా చేస్తే చర్యలు

భైంసాటౌన్: గోవులను అక్రమంగా రవాణా చేస్తే కఠినచర్యలు తీసుకుంటామని పట్టణ సీఐ డి.రాజారెడ్డి హెచ్చరించారు. ఆదివారం రాత్రి ఓ వాహనంలో అక్రమంగా తరలిస్తున్న నాలుగు గోవులను పట్టణంలోని మహాగాం బైపాస్ రోడ్ వద్ద పట్టుకున్నట్లు తెలిపారు. ఈ మేరకు వాహనం స్వాధీనం చేసుకుని గోవులను తరలిస్తున్న ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

నాణ్యమైన విద్యనందిస్తాం



ప్రచారం నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

కుంటాల: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందిస్తామని హెచ్‌ఎం సక్రపు గజేందర్ అన్నారు. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో భాగంగా సోమవారం కుంటాలలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు వెంకట్‌రావు, సిబ్బంది మానాజీగారి రాజు, తదితరులు పాల్గొన్నారు.

'బండి'ని కలిసిన నేతలు



బండి సంజయ్‌ను సన్మానిస్తున్న నాయకులు

కుంటాల: ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ ప్రమాణ స్వీకారానికి ఢిల్లీ వెళ్లిన మండలానికి చెందిన బీజేపీ నేతలు సోమవారం కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను కలిసారు. మాజీ ఎంపీపీ అరుణ రమణారావు ఆధ్వర్యంలో నేతలు ఆయనను కలిసి సత్కరించారు. మండలానికి చెందిన నాయకులు పాల్గొన్నారు.

హామీ నెరవేర్చిన ఎమ్మెల్యే



పేర్కపల్లెలో బోరు వేయిస్తున్న నాయకులు

దస్తురాబాద్: మండలంలోని పేర్కపల్లెలో పోచమ్మ ఆలయం సమీపంలో సోమవారం తాగునీటి సమస్య పరిష్కారానికి బోరు వేయించారు. అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ దృష్టికి తాగునీటి సమస్య తీసుకొచ్చారు. ఎన్నికల్లో గెలిస్తే సమస్య పరిష్కరిస్తానని ఇచ్చిన హామీ మేరకు నూతన బోర్‌వెల్ వేయించారు. దీంతో దీర్ఘకాలంగా ఉన్న నీటి సమస్య పరిష్కారమైందని కాలనీవాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు చుంచు వెంకన్న, గోపు రాజన్న, సత్తన్న, సత్యనారాయణ, శ్రీనివాస్, పోషన్న, మల్లయ్య, రాజన్న, గ్రామస్తులు పాల్గొన్నారు.

స్వప్రయోజనాలకు బోర్లు వినియోగిస్తున్నారని ఫిర్యాదు



వినతిపత్రం ఇస్తున్న గ్రామస్తులు

ఖానాపూర్: మండలంలోని ఎక్బాల్‌పూర్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన చేతిపంపులకు కొందరు వ్యక్తులు మోటార్లు బిగించి స్వప్రయోజనాలకు వినియోగిస్తున్నారని గ్రామస్తులు సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. గ్రామంలోని బోర్లకు ఉన్న చేతిపంపులను తొలగించడంతో పాటు అదే స్థానంలో మోటార్లను ఏర్పాటు చేశారన్నారు. చేతి పంపులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, సంబంధిత అధికారులు దీనిపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు మరమ్మతు చేయించి ప్రజావసరాలకు వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం ఈ విషయమై సూపరింటెండెంట్ నరసింహస్వామికి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు జేవింద్, మోహన్, నరేష్, దేవిచంద్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన గిరిజన విద్యార్థి



తేజావత్ సిద్దూ

దస్తురాబాద్: మండలంలోని ఎర్రగుంట గ్రామానికి చెందిన తేజావత్ రవీందర్–శేవంత దంపతుల కుమారుడు సిద్దూ ఇటీవల విడుదలైన జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష ఫలితాల్లో సత్తా చాటాడు. ఎస్టీ కేటగిరీలో 250వ ర్యాంకు సాధించి ప్రతిభ కనబర్చాడు. సదరు విద్యార్థిని గ్రామస్తులు అభినందించారు.

మోదీ ప్రధాని కావడంపై దుబాయ్‌లో సంబరాలు



వేడుకల్లో పాల్గొన్న గల్ఫ్ కార్మికులు

ఖానాపూర్: నరేంద్ర మోదీ మూడోసారి ప్రధాని కావడంపై ఆదివారం రాత్రి దుబాయిలో గల్ఫ్ కార్మికులు సంబురాలు చేసుకున్నారు. దుబాయిలోని జబల్‌అలీలో గల సలీంమాల్ ఖాన్‌సిటీ రెస్టారెంట్ వద్ద ఈ వేడుకలు నిర్వహించారు. అవినీతి రహిత పాలన సాగిస్తున్న నరేంద్రమోదీ హ్యాట్రిక్ ప్రధాని కావడం దేశానికి గర్వకారణమన్నారు. పవన్ సాయి, గోపు రాజశేఖర్, రవి, సాగర్, లక్ష్మణ్, రాజేశ్వర్, అజయ్, అభిలాష్, రాజేశ్, భూమేష్, కుమార్, రాము, బాలమల్లు, బాలరాజు పాల్గొన్నారు.

'ఎస్సీ, ఎస్టీలకు న్యాయం చేయాలి'



మాట్లాడుతున్న గొల్ల రాజమల్లు

ఖానాపూర్: రాబోయే పంచాయతీరాజ్ ఎన్నికల్లో ఏజెన్సీ ప్రాంతాల్లో ఉన్న పరిస్థితులపై ప్రభుత్వం సమీక్షలు జరిపి ఎస్సీ, ఎస్టీలకు తగు న్యాయం చేయాలని ఆలిండియా ఎస్సీ, ఎస్టీ ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గొల్ల రాజమల్లు అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి తీసుకున్న కులగణన నిర్ణయాన్ని తాము స్వాగతిస్తున్నామన్నారు. కులగణన ఆధారంగా మెజార్టీగా ఉన్న సామాజిక వర్గాలకు జనాభా ప్రాతిపదికన పంచాయతీల్లో రిజర్వేషన్లు కేటాయించాలన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్, నాయకులు ముత్తయ్య, శ్రీనివాస్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదుల విభాగం సద్వినియోగం చేసుకోవాలి



ఫిర్యాదు స్వీకరిస్తున్న తహసీల్దార్

కుంటాల: ప్రజా ఫిర్యాదుల విభాగాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్ అన్నారు. సోమవారం తాహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుంటాలకు చెందిన రైతు సిర్కూర్ నరేందర్ పాస్ పుస్తకంలో భూమి సరిగా ఉన్నా ఆన్‌లైన్‌లో తక్కువగా చూపిస్తుందని, తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకున్నాడు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎంఏ రహీం, ఏవో సోమ లింగారెడ్డి, విద్యుత్ ఏఈ శివప్రసాద్, వైద్యురాలు శృతిరెడ్డి, ఐసీడీఎస్ సూపర్ వైజర్ లక్ష్మీవిశారద, ఏపీవో గట్టుపల్లి నవీన్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాల అభివృద్ధికి సహకరించాలి



వినతిపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

భైంసాటౌన్: ముధోల్ నియోజకవర్గంలోని ఆలయాల అభివృద్ధికి సహకరించాలని ఎమ్మెల్యే పి.రామారావుపటేల్ దేవాదాయ శాఖ సహాయ కమిషనర్‌ను కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆయనను కలిసి వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో ఆయా ఆలయాలకు ఇప్పటికే టెండర్లు పూర్తయిన వాటికి అప్రూవల్ ఇవ్వాలని, నూతనంగా మంజూరైన ఆలయాలకు టెండర్లు పిలవాలని కోరారు. ఆయన వెంట నాయకులు సావ్లి రమేశ్, భీంరావు ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న నారాయణరావు పటేల్

సారంగాపూర్: మండలంలోని కంకెట గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు మేకల చిన్నగంగన్న మూడురోజుల క్రితం గుండెపోటుతో మృతి చెందాడు. బాధిత కుటుంబాన్ని సోమవారం జెడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి పరామర్శించారు. ఆయన వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దశరథ రాజేశ్వర్, నాయకులు భోజాగౌడ్, బీరవెల్లి మాజీ సర్పంచ్ ఎల్లన్న, సురేందర్, మారుతీ, ఆనంద్ రావు, గజానంద్, శేఖర్, రాజేశ్వర్, రాజు, దేవన్న, తదితరులు ఉన్నారు.

కడెం: మండలంలోని కొండుకూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నల్ల జీ వన్‌రెడ్డి తల్లి గంగవ్వ ఇటీవలే అనారోగ్యంతో మృతి చెందింది. ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ దంపతులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బాసర: ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బిద్రెల్లి గ్రామానికి చెందిన బెండే కామన్న పటేల్ కుటుంబ సభ్యులను సోమవారం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బోస్లే నారాయణరావు పటేల్ పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల ప్రెసిడెంట్ రమేశ్, బీసీసెల్ అధ్యక్షుడు జంగం రమేశ్, బ్లాక్ కమిటీ అధ్యక్షుడు శంకర్ చంద్రే, భైంసా మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ ఓం ప్రకాష్‌లడ్డా, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఏపీఎం మృతి



గంగన్న(ఫైల్)

నిర్మల్‌రూరల్: నిర్మల్ మండల ఏపీఎంగా పనిచేస్తున్న లింగంపల్లి గంగన్న (55) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందాడు. ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండల కేంద్రానికి చెందిన గంగన్న కొన్నేళ్లుగా నిర్మల్ ఐకేపీలో ఏపీఎంగా విధులు నిర్వహిస్తున్నాడు. మూడు రోజుల క్రితం సంగారెడ్డిలో ఉన్న తన కూతురు వద్దకు వెళ్లగా రాత్రి గుండెపోటు రావడంతో రంగారెడ్డి జిల్లాలోని ఆస్పత్రి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య, కుమారుడు, కూతురు ఉన్నారు.

చెట్లకిందే నిరీక్షణ..





రిజిస్ట్రేషన్ ద్వారా ప్రభుత్వానికి ఆదాయం వస్తున్నా తహసీల్దార్ కార్యాలయంలో ప్రజలకు సౌకర్యాలు కరువయ్యాయి. నిత్యం పదుల సంఖ్యలో లబ్ధిదారులు రిజిస్ట్రేషన్ కోసం తహసీల్ కార్యాలయానికి వస్తున్నారు. వారికి కూర్చునేందుకు కుర్చీలు, బెంచీలు లేకపోవడంతో కార్యాలయ ఆవరణలోని చెట్లకిందే నిరీక్షిస్తున్నారు. లేదంటే వరండాలో గంటల తరబడి నిలబడుతున్నారు. కనీసం తాగు నీటివసతి కూడా ఏర్పాటు చేయకపోవడంతో అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత శాఖ అధికారులు స్పందించి కార్యాలయంలో ఫర్నీచర్ ఏర్పాటు చేసి నీటి వసతి కల్పించాలని కోరుతున్నారు. - తానూరు